

ఇల కైలాసానికి సీప్లేన్

- అద్భుత ఘట్టానికి వేదికగా శ్రీశైలం
- పాతాళగంగలో ట్రైల్ రన్ విజయవంతం
- శ్రీశైలం-విజయవాడ క్షేత్రాల నడుమ టెంపుల్ టూరిజం
- గంటలోపే ఇంద్రకీలాద్రికి చేరుకునే అవకాశం
- నేడు డెమోను ప్రారంభించనున్న సీఎం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ

మరో అద్భుత ఘట్టానికి శ్రీశైలం పాతాళ గంగ వేదిక కానుంది. టూరిజాన్ని అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సీప్లేన్ టూరిజానికి శ్రీకారం చుట్టనుంది. విజయవాడ ఇంద్రకీలాద్రి, శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాల మధ్య టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి కానుంది. అందులో భాగంగా సీప్లేన్ రవాణా మార్గానికి ప్రణాళిక రూపొందించింది. ఈ క్రమంలో శుక్రవారం మొదట విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి బయల్దేరిన సీ ప్లేన్ శ్రీశైలంలో సందడి చేసింది. శ్రీశైలం జలాశయం నీటిపై తేలుతూ బోటింగ్ జట్టీ సురక్షితంగా ల్యాండ్ అయింది. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, టూరిజం, ఎయిర్ ఫోర్స్ అధికారుల సమక్షంలో ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. డీ హవిల్లాండ్ ఎయిర్ క్రాఫ్ట్ సంస్థ రూపొందించిన ఈ సీ ప్లేన్‌లో 14 మంది ప్రయాణించేలా సీటింగ్ ఏర్పాటు చేశారు. విజయవాడ-శ్రీశైలం మధ్య రోడ్డు మార్గంలో సుమారు 270 కిలోమీటర్ల దూరం ఉంటుంది. రోడ్డు మార్గం ద్వారా అయితే ఆరు గంటలకు పైగా సమయం పడుతుంది. అదే సీ ప్లేన్‌లో గంటన్నర సమయంలోనే చేరుకోవచ్చు.

న్యూస్ బాక్స్

బీటెక్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో రెగ్యులర్ 2,4,6 వ సెమిస్టర్, సప్లమెంటరీ విభాగంలో 1 నుంచి 7వ సెమిస్టర్ వరకు ఫలితాలను విడుదల చేశారు. ఫలితాల వివరాల కోసం వర్సిటీ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో సంప్రందించాలని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు.

18 నుంచి డిగ్రీ ప్రాక్టికల్స్

కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 1,3, 5 సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 18 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్ వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షల టైం టేబుల్ నిర్ణత సమయంలో తెలియ జేస్తామని, మరిన్ని వివరాలకు కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి


కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అందరికీ చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలో జాతీయ న్యాయ సేవా సంస్థ ఏర్పాటు చేసిన జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సదస్సుకు ఆయనతోపాటు ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్, వర్సిటీ ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేని వారు, మహిళలు తమను సంప్రదిస్తే ఉచితంగా న్యాయం సాయం అందిస్తామన్నారు. రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్స్ సీవీ కృష్ణారెడ్డి, వై. హరిప్రసా ద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.నాగరాజు, ప్రొఫెసర్లు సుందరానంద పుచ్చా పాల్గొన్నారు.

మాతృ మరణాలపై సమీక్ష

కర్నూలు హాస్పిటల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సెప్టెంబరులో సంభవించిన మాతృ మరణంపై డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో కర్నూలు జీజీహెచ్ గైనకాలజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ సావిత్రి, అసిస్టెంట్ ప్రొఫెసర్ అమర్‌నాథ్, వెంకటనారాయణ, వైద్యాధికారులతో మరణాలపై కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు పీహెచ్‌సీ వైద్యులు డాశైలేష్, డీపీహెచ్ఎన్‌వో ఇందిర, ఎస్‌వో హేమసుందరం, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లు కళకళ

- డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,645 ఖాళీలు
- ఎస్జీటీ 1791, స్కూల్ అసిస్టెంటు పోస్టులు 854



కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులతో కర్నూలు నగరంలోని శిక్షణా కేంద్రాలు కళకళలాడుతున్నాయి. డీఎస్సీకి ప్రిపేర్ చేయడంలో పూర్తిగా నిమగ్నమయ్యాయి. అక్టోబరు 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు టెట్ ఆన్‌లైన్ పరీక్ష జరిగింది. జిల్లాలో 54,083 మంది అభ్యర్థులు టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే టెట్ ఫలితాలు ఈ నెల 4వ తేదీన విడుదలయ్యాయి. జిల్లాలో దాదాపు 50.95 శాతం మంది డీఎస్సీకి అర్హత సాధించారు. డీఎస్సీ నోటిఫికేషన్ త్వరలో విడుదల చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం చకచకా చర్యలు తీసుకుంటోంది.

ఆరేళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. 2019 ఎన్నికల ముందు పాదయాత్రలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి యేటా డీఎస్సీ నిర్వహిస్తానని అభ్యర్థులకు హామీ ఇచ్చారు. గద్దెనెక్కిన తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ గురించి పట్టించుకోలేదు. గత జగన్ ప్రభుత్వం మాట ఇచ్చి మోసం చేసిందంటూ అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల విలీనం పేరుతో గత వైసీపీ ప్రభుత్వం 117 జీవోను తీసుకు వచ్చింది. దీని వల్ల ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గిపోయింది. కొత్త పోస్టులు చేపట్టకపోగా 117 జీవోతో ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు భారీగా కోత పెట్టడం ఏమిటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీ ఇస్తానని మాట ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడిన మొదటిసారే 16,345 పోస్టులతో మెగా డీఎస్సీపై సంతకం చేశారు.

త్వరలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్

మెగా డీఎస్సీకి సంబంధించి నోటిఫికేషన్ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రకటన విడుదల తేదీ నుంచి నెల రోజుల పాటు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. 2025 ఫిబ్రవరిలో డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా పరిషత్, ప్రభుత్వ మున్సిపల్ పాఠశాలల్లో మొత్తం ఉపాధ్యాయ ఖాళీలు 2645 ఉన్నాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు 854, ఎస్జీటీ పోస్టులు 1791 పోస్టులు ఉన్నాయి.

● ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ద్వారా ఉచిత శిక్షణ

రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తుండటంతో బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణను ప్రభుత్వం ఇప్పిస్తోంది. ఇప్పటికే ఆ శాఖల ద్వారా ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించారు. స్క్రీనింగ్ టెస్టు నిర్వహించి మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇస్తారు. ఇలా చేయడం పట్ల పేద, మధ్యతరగతి అభ్యర్థులకు పెద్ద ఊరట కలిగింది. ఒక్కొక్క అభ్యర్థికి దాదాపు 20 వేలకు పైగా శిక్షణకు ప్రభుత్వం వ్యయం చేస్తోంది.

● ఆత్మ విశ్వాసంతో చదువుతున్నా



డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం. 2020లో టీటీసీ పూర్తి చేశాను. మొదటి సారి డీఎస్సీకి సిద్ధమవుతుఅన్న. టెట్ పరీక్షలో డీఎస్సీకి అర్హత సాధించాను.. ఈ ఆత్మవిశ్వాసం తోనే డీఎస్సీ కోసం కరెంటు అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ సబ్జెక్టు మెటీరియల్స్‌ను చదువుతున్నాను.

-కె.శేఖర్, టీటీసీ అభ్యర్థి

జాప్యం లేకుండా డీఎస్సీ నిర్వహించాలి




టెట్ ఫలితాలు విడుదలయ్యాయి. వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో జాప్యం చేయరాదు. గత వైసీపీ ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా నిరుద్యోగులను మోసం చేసింది. డీఎస్సీ నిర్వహించి ఫలితాలను ప్రకటించి వెంటనే ఉద్యోగాల ఉత్తర్వులు ఇవ్వాలి.

- ఆర్.ప్రతాప్, ఎమ్మెస్సీ, బీఎడ్

కర్నూలులో అఘోరీ హల్‌చల్

- బళ్లారి చౌరస్తా నుంచి గుత్తి రోడ్డు వైపు వెళ్లిన నాగసాధువు
- పూడిచెర్లలో అడ్డుకున్న పోలీసులు, అక్కడే బైఠాయింపు



6లో..

20 మంది సీఐల బదిలీ 7

అప్పుల ఊబికి రైతు బలి

అసభ్యకర పోస్టులపై ఫిర్యాదు 7

బెల్టు షాపులను రద్దు చేయాలి

మంత్రాలయంలో తెలుగు తమ్ముళ్ల ధర్నా



మంత్రాలయంలో బెల్టు షాపులు రద్దు చేయాలని ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం క్షేత్రంలో బెల్టు షాపులను రద్దు చేయాలని మండల టీడీపీ కన్వీనర్ పన్నగ వెంకటేశ్ స్వామి అన్నారు. శుక్రవారం సాయంత్రం నాయకులు, కార్యకర్తలు టీడీపీ కార్యాలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్‌కు చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా పన్నగ వెంకటేశ్ స్వామి మాట్లాడుతూ మంత్రాలయంలో ఎంటీఆర్, ఆర్టీసీ బస్టాండు, రాఘవేంద్రపురం, రామచంద్రనగర్, ఓల్డ్‌టౌన్, నాగలదిన్నె రోడ్డు, నది తీరం, నది ఒడ్డున ఇలా అనేక చోట్ల బెల్టు షాపులు ఏర్పాటు చేశారని అన్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, గువ్వల భీమన్న, యేబు, వగరూరు అబ్దుల్లా, కృష్ణమోహన్ రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, నరసింహులు, కేశన్న, పవన్ కుమార్, సుంకప్ప, సుజ్ఞానం, హనుమంతు పాల్గొన్నారు.

మంత్రాలయంలో అక్రమాలపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న సీఐ రామాంజులు

మంత్రాలయం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో ఇసుక, మద్యం, గుట్కా, మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్‌లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రాలయంలో లాడ్జిల్లో ఆధార్, ఐడెంటీ కార్డు, ఊరు, సెల్ నెంబర్ నమోదు చేసుకున్న తర్వాతనే రూములు అద్దెకు ఇవ్వాలని యజమానులకు సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన ఆటోవాలాలపై చర్యలు తప్పవని అన్నారు. మంత్రాలయంలో బెల్టు షాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇప్పటికే మద్యం అమ్మకందారులను బైండోవర్ చేశామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై ట్రాక్టర్లు సీజ్ చేసి భూగర్భగనుల శాఖ అధికారులకు అప్పగించినట్లు చెప్పారు.

సర్దుబాటు చార్జీల వడ్డింపు

- డీసీసీ పి. మురళీకృష్ణ
- విద్యుత్ శాఖ ఎస్ఈ భవన్ ఎదుట కాంగ్రెస్ నిరసన




నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు వడ్డించి పేదల నడ్డి విరిస్తోందని డీసీసీ పి. మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం విద్యుత్ భవన్ ఎస్ఈ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల సర్దుబాటు పేరుతో ప్రజలపై భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. రాత్రి లాంతర్లతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకు చుక్కలు చూపిస్తోందని మండిపడ్డారు. రూ. 11 వేల కోట్లు సిద్ధం చేశారని, మొత్తం రూ.17 వేల కోట్లు సర్దు బాటు కింద మోపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో డీసీసీ సిటీ అధ్యక్షుడు జిలానీ బాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, పీజీ రాంపుల్లయ్య యాదవ్, దామోదరం రాజనరసింహ, బి, బతుకన్న, అనంత రత్నం, లాజరస్, ఎ. వెంకటసుజాత, షేక్ ఖాజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ముద్ర

- గత టీడీపీ ప్రభుత్వంలో రూ.580 కోట్ల మాస్టర్ ప్లాన్
- టీటీడీ తరహాలో ప్రగతి
- ఔటర్ రింగ్ రోడ్, మాడ వీధుల నిర్మాణం
- సోమశిల, నాగార్జునసాగర్ నుంచి బోటింగ్
- తాజాగా విజయవాడ - శ్రీశైలం మధ్య సీ ప్లేన్



కర్నూలు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం.. దక్షిణ కాశిగా ప్రసిద్ధి. జ్యోతిర్లింగాల్లో ద్వితీయ జ్యోతిర్లింగం.. అష్టాదశ శక్తిపీఠాల్లో ఆరోశక్తి పీఠం.. ఈ రెండు కలయిక దివ్యక్షేత్రం. భ్రమరాంబికదేవి, మల్లికార్జునుడు ఇద్దరు ఒకే చోట కొలువైనందున శివశక్తి క్షేత్రంగా తేజోమయమై దినదినాభివృద్ధి చెందుతోంది. ఈ దివ్య క్షేత్రం పదేళ్ల క్రితం, ఆ తరువాత చూసిన వారికి ప్రగతి పరుగులు పెడుతున్న తీరు స్పష్టంగా కనిపిస్తుంది. 2014 తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు 2016లో కృష్ణా పుష్కరాల కోసం శ్రీశైలం వచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో అభివృద్ధి చేయాలని సంకల్పించారు. రూ.580 కోట్లతో ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించారు. పక్కాగా అమలు చేసేందుకు ఐఏఎస్ అధికారి భరత్‌గుప్తాను శ్రీశైలం దేవస్థానం ఈవోగా నియమించారు. ఆనాడు చంద్రబాబు వేసిన పునాదులపై శివశక్తి పీఠం ఊహించని ప్రగతి సాధించింది. ఈ ఏడాది జూన్ 12న నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు భక్తుల సౌకర్యార్థం, దేవాలయ పర్యాటక (టెంపుల్ టూరిజం) అభివృద్ధిలో భాగంగా సోమశిల, నాగార్జునసాగర్ నుంచి బోటు సౌకర్యం కల్పించారు. తాజాగా విజయవాడ నుంచి శ్రీశైలానికి 'సీ ప్లేన్' రవాణాకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది.

(మిగతా 7లో)



శ్రీశైలం నుంచి పాతాళ గంగకు వెళ్లే రోప్ వే

ఇల శ్రీశైలానికి సీప్లేన్

- ట్రయల్ రన్ విజయవంతం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- నేడు సీప్లేన్‌లో శ్రీశైలానికి సీఎం చంద్రబాబు
- శ్రీశైలం అడవులను జల్లెడ పట్టిన భద్రతా బలగాలు










శ్రీశైలం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం ఉదయం సీప్లేన్ ద్వారా శ్రీశైలం చేరుకోనున్నారు. విజయవాడ-శ్రీశైలం మధ్య సీప్లేన్ సర్వీసు డెమో కార్యక్రమాన్ని విజయవాడ పున్నమి ఘాట్ వద్ద ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణు చరణ్, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా సీప్లేన్ ల్యాండ్ అయ్యే ప్రదేశం, పాతాళగంగ బోటింగ్ ప్రదేశం నుంచి రోప్ వే, అక్కడి నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనం ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సీఎం పర్యటనలో 523 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితోపాటు పది స్పెషల్ పార్టీ బృందాలు, నాలుగు గ్రేహౌండ్స్ బృందాలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లుగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శ్రీశైలం పాతాళగంగ, డ్యాం పరిసర ప్రాంతాల్లో గ్రేహౌండ్స్, పది స్పెషల్ పార్టీల బలగాలతో శ్రీశైలం అడవులన్నింటిని జల్లెడ పట్టామని తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి



● సీఎం పర్యటన ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'స్కై-మీట్స్ సీ' పేరుతో చేపట్టిన విజయవాడ-శ్రీశైలం సీప్లేన్ సర్వీసును విజయవాడ పున్నమి ఘాట్ వద్ద శనివారం ఉదయం 10:55 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. తరువాత 12 గంటలకు సీప్లేన్‌లో బయలుదేరి 12:45 గంటలకు శ్రీశైలం పాతాళగంగ కృష్ణా నదిపై లాండింగ్ అవుతారు. అనంతరం రోప్‌వే లోవర్ స్టేషన్ నుంచి రోప్‌వే అప్పర్ స్టేషన్‌కు ఒంటి గంటకు చేరుకుంటారు. అక్కడి నుంచి సీఎం కాన్వాయ్ ద్వారా రోడ్డు మార్గంలో స్వామి, అమ్మవార్ల ప్రధాన ఆలయం వద్దకు చేరుకోనున్నారు. 1:05 నుంచి 1:25 గంటల సమయంలో సీఎం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దర్శనానంతరం తిరిగి 1:30 గంటలకు కాన్వాయ్ ద్వారా రోప్‌వే అప్పర్ స్టేషన్‌కు చేరుకుని 2 గంటలకు మీడియాతో సమావేశం కానున్నారు. తరువాత 2:30 గంటలకు రోప్‌వే ద్వారా సీప్లేన్ చేరుకుని విజయవాడకు చేరుకోనున్నారు.





● సీప్లేన్ ట్రైల్ రన్

విజయవంతం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శుక్రవారం విజయవాడ నుంచి శ్రీశైలం సీప్లేన్ ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం విజయవాడ పున్నమి ఘాట్ నుంచి సీప్లేన్ 10.30 గంటల సమయంలో బయలుదేరి శ్రీశైలం పాతాళగంగ వద్ద కృష్ణా నదిపై చెక్కర్లు కొట్టి 11.30-12 గంటల సమయంలో ల్యాండ్ అయింది. శ్రీశైలం చేరుకున్న సీప్లేన్‌ను కలెక్టర్ జి. రాజకుమారి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం పర్యటించే పాతాళగంగ బోటింగ్, రోప్‌వే ఎంట్రీ పాయింట్ నుంచి రోడ్డు మార్గం, స్వామి, అమ్మవార్ల ఆలయ ప్రదేశాల ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించి పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టారు.

● హాజరు కానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

ముఖ్యమంత్రి శ్రీశైలం పర్యటన సందర్భంగా పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే హాజరు కానున్నారు. మంత్రులు రామనారాయణ రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, నిమ్మల రామనాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఎంపీలు బైరెడ్డి శబరి, బి. నాగరాజు, ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖరరెడ్డి, జి. జయసూర్య, భూమా అఖిలప్రియ రెడ్డి, గౌరు చరితారెడ్డి, జయనాగేశ్వరరెడ్డి, బి. దస్తగిరి, పార్థసారథి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, దేవదాయశాఖ కమిషనరు ఎస్. సత్యనారాయణలు హాజరుకానున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ



శ్రీశైలంలో ట్రయల్ రన్

గ్రామాభివృద్ధికి సహకరించండి

-జిల్లా పంచాయతీ అధికారి ఎల్. భాస్కర్



మాట్లాడుతున్న డీపీఓ ఎల్. భాస్కర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కర్నూలు జిల్లా పంచాయతీ అధికారి ఎల్.భాస్కర్ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్లకు డీపీఆర్‌సీలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. ఈ నెల 5, 6 తేదీలలో ఒక బ్యాచ్ 7, 8 తేదీలలో రెండవ బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చారు. ప్రజాప్రణాళిక ప్రచారం(2024-25) ద్వారా పంచయతీ అభివృద్ధి ప్రణాళిక(2025-26) తయారీ ప్రక్రియపై జిల్లా స్థాయి టీఓటీలు అవగాహన కల్పించారు. శిక్షణ తీసుకున్న వారందరూ ఈ నెల 12, 16 తేదీలలో సంబంధిత మండలాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల స్థాయి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపీడీఓలు రఘునాథ్, శ్రీనివాసులు, రాముడు, శివనాగప్రసాద్, మణిమంజరి పాల్గొన్నారు.

15 వరకు ప్రత్యేక శిబిరాలు

● పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దనరెడ్డి



కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కొత్త ఐపీపీబీ ఖాతాలను ప్రారంభించేందుకు ఈ నెల 15 వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తపాలా శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయిలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ) ద్వారా కొత్త ఖాతాలను తెరవనున్నట్లు, ఆధార్ లింకేజీని సులభతరం చేయనున్నట్లు తెలిపారు. దీని కోసమే క్యాంపులను డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) లబ్ధిదారుల కోసం నిర్వహిస్తున్నామన్నారు.

జిల్లా అఫీషియల్ రిసీవర్‌గా న్యాయవాది ఎస్. బాబు సాహెబ్



కర్నూలు లీగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అఫీషియల్ రిసీవర్‌గా స్థానిక న్యాయవాది ఎస్. బాబు సాహెబ్ నియమితులయ్యారు. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి ఈయనను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఈయన శుక్రవారం కర్నూలు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్నా దేవిని కలిసి తన నియామక పత్రాలను అందజేసి బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో దాఖలైన ఐపీ కేసులలో ఉన్న ఆస్తుల వ్యవహారాలను ఈయన పర్యవేక్షిస్తారు. ఆయనను పలువురు అభినందించారు.

కర్నూలులో ప్రత్యక్షమైన అఘోరీ

- బళ్లారి చౌరస్తా నుంచి గుత్తి రోడ్డు వైపు వెళ్లిన నాగసాధువు
- యాగంటి వెళ్లి పూజలు చేస్తానని వెల్లడించిన వైనం

కర్నూలు కల్చరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో హల్‌చల్ చేస్తున్న మహిళా అఘోరీ శుక్రవారం కర్నూలులో ప్రత్యక్షమైంది. మధ్యాహ్న సమయంలో నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి గుత్తి రోడ్డు వైపు హైదరాబాదు - బెంగళూరు జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్లింది. స్థానికులు మొదట ఆమెను వింతగా చూసి ఆ తర్వాత మొక్కేందుకు ప్రయత్నించారు. కొందరు యువకులు సెల్ఫీలు తీసుకునే యత్నం చేయగా వారిని దాటుకుంటూ ఆమె ముందుకు సాగారు. ఐటీ సర్కిల్ వద్ద ఒక మహిళా భక్తురాలు ఇచ్చిన మంచినీటిని తాగి కొద్దిసేపు రోడ్డు పక్కన డివైడర్‌పై కూర్చుండిపోయారు. పోలీసులు ఇబ్బంది పెట్టడం వల్లే తన కారు ప్రమాదం జరిగిందని అన్నారు. పోలీసులు ఇంకా ఎన్ని ఇబ్బందులు పెడతారో పెట్టండి.. చంపేయండి లేదా ఉరిశిక్ష వేస్తే పీడపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కారు ఎప్పుడు తన చేతికి వస్తుందో తెలియదని, కారు రిపేరు అయ్యేంత వరకు పాదయాత్ర చేస్తూనే ఉంటానని చెప్పారు. ప్రస్తుతం యాగంటికి వెళుతున్నానని, తర్వాత మహానంది, శ్రీశైలం వెళ్లి పూజలు చేస్తానని ఆమె తెలిపారు. కాగా ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్లకు రాగానే పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో భక్తులు అధికంగా రావడంతో అఘోరీ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాను వెళ్లాల్సిందేనని పట్టుపట్టారు. చివరకు ఆమె అక్కడే బైఠాయించారు.



హైదరాబాదు - బెంగళూరు జాతీయ రహదారిపై పాదయాత్రగా వెళుతున్న మహిళా అఘోరి

చెంప పగులగొడతా.. వెళ్లిపో..!

- ఓ గర్భిణిపై డ్యూటీ డాక్టర్ దురుసు ప్రవర్తన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితురాలు



కర్నూలు హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓ ఐదు నెలల గర్భిణికి అవమానకర ఘటన ఎదురైంది. దీంతో బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆ వివరాలు ఇలా.. కర్నూలు నగరం పాతబస్తాండుకు చెందిన గర్భిణి లక్ష్మీకాంతమ్మ కడుపు నొప్పితో బాధపడుతూ గురువారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఆసుపత్రిలోని గైనిక్ వార్డుకు వెళ్లింది. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్ ఆమె పట్ల చాలా దారుణంగా ప్రవర్తించారు. గంటసేపు కూర్చోబెట్టి 'నీ మొహం చూడలేనని.. చికిత్స చేయలేనని.. వెళ్లిపొమ్మని' హెచ్చరించారు. దీంతో బాధ వేసి ఆ గర్భిణి బయటకు వెళ్లిపోయింది. ఆమె భర్త ఈ సమయంలో ఎవరూ చూడరని నచ్చజెప్పి మరలా లోపలికి తీసుకెళ్లాడు. దీంతో ఆ డాక్టర్ మరోసారి కోపంతో ఊగిపోయారు. చెంప పగులకొడతానని అనడంతో మనస్తాపానికి గురై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే వెంకటేశ్వర్లు ముగ్గురు వైద్యులతో విచారణ కమిటీ వేశారు. ఈ కమిటీలో మెడిసిన్ హెచ్‌వోడీ డా.ఎస్.లక్ష్మీబాయి, గైనిక్ హెచ్‌వోడీ డా.ఎ.శ్రీలక్ష్మి, డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంవో డా.బి. హేమనళిని ఉంటారని, విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

నాటి కలిమి గుళ్లే.. నేటి కొలిమిగుండ్ల

ఊరి పేరు కథ

- పల్లవ రాజుల పాలనకు సజీవ సాక్ష్యం
- రాష్ట్ర వ్యాప్తంగా మూడు చోట్ల ఈ నిర్మాణాలు
- ఎటుచూసినా మూడు గుళ్లుగా కనిపించే అద్భుత కట్టడం





మూడుగా కనిపిస్తున్న కలిమిగుళ్లు

కొలిమిగుండ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్ల మండల కేంద్రానికి వాయవ్య దిశలో వెలసిన కలిమి గుళ్లు (మూడు గుళ్లు) 9వ శతాబ్దంలోని పల్లవరాజుల పాలనకు సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. కలిమి అనగా సంపద. పల్లవరాజుల కాలంలో సంపదను దాచడానికి ఈ గుళ్లు ఏర్పాటు చేసి అందులోనే విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించి పూజలు చేసేవారు. ఈ క్రమంలో నిర్మించిన కలిమిగుళ్లు గ్రామమే కాలక్రమంలో కొలిమిగుండ్లగా రూపాంతరం చెందింది. క్రీస్తు శకం 1900 శతాబ్దంలో గద్వాల సంస్థానాన్ని సందర్శించిన కొలిమిగుండ్లకు చెందిన కవి బోయన నరసింహులు అక్కడ రాసిన తన సాహిత్యం లో కలిమిగుళ్ల గురించి, వాటి ప్రాశస్త్యం గురిం చి విపులంగా విశదీకరించినట్లు తెలుస్తోంది. 9వ శతాబ్దంలో పల్లవ రాజుల వంశానికి చెంది న రాజు రాజమహేంద్రవర్మ శైవమత ప్రచారంలో భాగంగా అద్భుతమైన కళా నైపుణ్యంతో ఈ కలిమిగుళ్లు నిర్మించారు. వీటినే స్థానికులు మూడుగుళ్లుగా పిలుస్తారు. వాస్తవానికి ఇవి నాలుగు గుళ్లు. కానీ దూరం నుంచి ఎటువైపు చూసినా మూడుగుళ్లుగా మాత్రమే కనిపిస్తాయి. ఇదే కలిమిగుళ్ల నిర్మాణ ప్రత్యేకతగా చెబుతారు. పల్లవ రాజులు శైవ మతానికి చెందిన వారు కావడంతో శైవమత ప్రచారంలో భాగంగా ఈ నాలుగు గుళ్లు నిర్మించి, ఇందులో గణపతి, పార్వతీ దేవి, ఈశ్వరుడు, వీరభద్ర స్వాములను ప్రతిష్ఠించారు. ఈశ్వరునికి ఉత్తర దిశలో వీరభద్రుడు, గణపతి, పడమరలో పార్వతీదేవి, తూర్పు మధ్య భాగంలో ధ్వజస్తంభం, ఈశాన్యంలో నాగులకట్ట, దక్షిణ ఆగ్నేయంలో దిగుడు బావి, నైరుతి దిశలో జమ్మి చెట్టు ఉన్నాయి.



కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గుహలు

శిథిలావస్థలో మూడు గుళ్లు

ఎంతో విశిష్టత కలిగిన ఈ మూడు గుళ్లు (కలిమి గుళ్లు) ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. విగ్రహాలు, ధ్వజస్తంభం, బావి ఆనవాళ్లు కూడా లేకుండా పోయా యి. ఈ గుళ్ల సంరక్షణకు ఎటువంటి మాన్యాలు లేకపోవడంతో ఈ గుళ్లు ఆలనాపాలనాకు నోచుకోక శిథిలమవుతున్నాయి. స్థానికులు వీటి పరిసరాలను ఆక్రమించి పెంట దిబ్బలుగా ఉపయోగించుకుంటున్నారు. 1995లో ఈ ఆలయాలపై అనంతపురానికి చెందిన ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వారు పరిశోధించి ఆలయ ప్రాంగణంలో తవ్వకాలు జరపగా సింధూ నాగరికత అవశేషాలు లభించాలయని స్థానిక పెద్దలు వెల్లడిస్తున్నారు.

రాష్ట్రంలో మూడు చోట్ల ఈ ఆలయాలు

అరుదైన కట్టడాలు ఉన్న ఇలాంటి గుళ్లు రాష్ట్రంలో మూడు చోట్ల ఉన్నట్లు పురావస్తు శాఖ అధికారులు గుర్తించారు. బనగానపల్లె మండలంలోని నందవరం, చిత్తూరు జిల్లా వాయల్పాడు గ్రామంలో ఈ కలిమి గుళ్లను పోలి ఉన్న గుళ్లు ఉన్నాయి. ఎంతో ప్రాధాన్యతను కలిగి ఉండటంతోపాటు కొలిమిగుండ్ల ఆవిర్భావానికి రూపాంతరాలైన కలిమిగుళ్లను సంరక్షించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.





శ్రీశైలం అభివృద్ధిలో చంద్రబాబు మార్క్

- గత టీడీపీ ప్రభుత్వంలో రూ.580 కోట్ల మాస్టర్ ప్లాన్
- ఔటర్ రింగ్ రోడ్, మాడ వీధుల నిర్మాణం
- సోమశిల, నాగార్జునసాగర్ నుంచి బోటింగ్
- తాజాగా విజయవాడ - శ్రీశైలం మధ్య సీ ప్లేన్

(5వ పేజీ తరువాయి)

● టీటీడీ తరహాలో అభివృద్ధి

శ్రీశైలం క్షేత్రం దేవదాయ శాఖ అధ్వర్యంలో ప్రగతి అడుగులు వేసినా.. 2016 తరువాత జరిగిన అభివృద్ధే చరిత్రలో నిలిచిపోతుంది. అందుకు ప్రధాన కారణం తిరుమల తిరుపతి దేవస్థానం (టీడీపీ)లాగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో నాటి సీఎం చంద్రబాబు రూ.580 కోట్లు అంచనాలతో మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేశారు. నిధులు ఇచ్చి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయలం చుట్టూ మాడవీధులు, ఔటర్ రింగ్ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, డార్మెంటరీలు, లలితాంబికదేవి కాంప్లెక్స్, సోలార్ దీపాలు, అన్నపూర్ణ సదన్, విశాలమైన రహదారులు, పచ్చదనం.. వంటి పనులతో శ్రీశైలం దేవస్థానం ప్రగతిని పరుగులు పెట్టించారు. పదేళ్ల క్రితంతో పోలిస్తే శ్రీశైలం అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందని భక్తులు పేర్కొంటున్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో ప్రగతి ఆగిపోయినా.. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ప్రగతి పరుగులు అందుకుంది. దేవాలయం పర్యాటక క్షేత్రం (టెంపుల్ టూరిజం) అభివృద్ధిలో భాగంగా దక్షిణ కాశిగా పేరుగాంచిన శ్రీశైలం మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నారు.

● సీ ప్లేన్, బోటింగ్‌తో టూరిజం అభివృద్ధి

సీఎం చంద్రబాబు సారథ్యంలో కొలువుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పర్యాటకంగా, సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే శ్రీశైలం జలాశయం దిగువన నాగార్జున సాగర్, ఎగువన సోమశిల నుంచి బోటింగ్ సౌకర్యం కల్పించారు. కృష్ణమ్మ జల పరవళ్లు, వంపుసొంపులు, నల్లమల పచ్చని అందాలను వీక్షిస్తూ శ్రీశైలం చేరుకునే అవకాశం కల్పించారు. భక్తులు, పర్యాటక ప్రేమికులు జల మార్గంలో గగత విహారం చేసేలా సీ ప్లేన్ ప్రారంభోత్సవం చేయబోతున్నారు. అంటే.. మల్లన్న క్షేత్రానికి వివిధ మార్గాల్లో చేరుకునే భక్తుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. దీంతో పర్యాటకం అభివృద్ధిలో పరుగులు తీయనుంది.

చంద్రబాబు చొరవతోనే...

- బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే



సీఎం చంద్రబాబుతోనే శ్రీశైల క్షేత్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందింది. గతంలో 2014-2019 హయంలో క్షేత్రంలో టెంపుల్ టూరిజం కింద రింగ్‌రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మాఢవీధుల నిర్మాణంతో పాటు క్యూకాంప్లెక్స్, ఆలయ ప్రధాన ద్వారం నుంచి నందిసర్కిల్ వరకు సాలా మండపాల నిర్మాణాలకు ప్రతిపాదనలు జరిగాయి. అయితే వైసీపీ అధికారంలోకి రావడంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. శ్రీశైలాన్ని ఆధ్యాత్మికంగా, సున్నిపెంట, లింగాలగట్టును పర్యాటకంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

వీటిపైనా దృష్టి సారించాలి

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో టూరిజం సర్క్యూట్‌కు ప్రసిద్ధి. యాగంటి, అహోబిళం, మహానంది, కొలనుభారతి క్షేత్రం, మంత్రాలయం, ఉరుకుంద ఈరన్న.. వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలలో పాటు, కర్నూలు నగర శివారున జగన్నాథగట్టు, కొండారెడ్డిబురుజు, బనగానలపల్లె నవాబులకోట, బెలూంగుహాలు.. వంటి పర్యాటక క్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. వాటి అభివృద్ధి కోసం కూడా ప్రత్యేక నిధులు కేటాయించాలి. శ్రీశైలం జలాశయం రక్షణ చర్యలు, పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించాలి. ఉమ్మడి జిల్లాల్లో అసంపూర్తిగా ఉన్న వేదవతి ప్రాజెక్టు, ఆర్డీఎస్ కుడి కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు, నగరడోణ జలాశయం నిర్మాణాలు పూర్తి చేయాలి. హంద్రీనీవా పత్తికొండ జలాశయం కుడి ఎడమ కాలువలకు నిధులు ఇవ్వాలి. అలగనూరు జలాశయం మరమ్మతులు తక్షణమే చేపట్టాలి. రాయలసీమ జిల్లా చిరకాల స్వప్నమైన తుంగభద్రపై గుండ్రేవుల జలాశయం, శ్రీశైలం ఎగువన కృష్ణా నదిపై సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలి. వీటిపై సీమ రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటితో పాటు అసంపూర్తిగా ఉన్న క్లస్టర్ యూనిర్సిటీ, ఉర్దూ విశ్వవిద్యాలయం, ఆదోని, కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలు, రాయలసీమ విశ్వవిద్యాలయం అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

మ్యాపింగ్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డీఆర్వో నారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేయడంపై అవగాహన ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకట నారాయణమ్మ అపరేటర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్-పీజీ ఆర్ఎస్ అర్జీలుతప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి మ్యాపింగ్ చేసేలా కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లా రెవెన్యూ అధికారి శిక్షణ నిర్వహించారు. దరఖాస్తులను కంప్యూటర్‌లో తప్పులు లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత వచ్చిన అర్జీని సంబంధిత డిపార్టుమెంట్‌కు పంపించేలా మ్యాపింగ్ చేయాలన్నారు. కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగ ప్రసన్నలక్ష్మి, జిల్లా స్థాయి అధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

- ఉసురు తీసిన అప్పు



జగన్ (ఫైల్)

కోడుమూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లపరి గ్రామంలో అప్పులబాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన యాగంటి జగన్, ఉరుకుందమ్మ దంపతులకు వ్యవసాయమే జీవనాధారం. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. జగన్ (41) పదేళ్ల నుంచి వారసత్వంగా వచ్చిన 2 ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నాడు. పంటలు కలిసిరాక ఐదేళ్ల క్రితం ఎకరా పొలం అప్పు కింద రాసి చ్చాడు. దీనికితోడు ప్రమాదంలో కాలు విరిగి బాగా ఖర్చు అయ్యింది. అయినా కుంగిపోకుండా అప్పులు తీర్చడానికి మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, కంది, ఉల్లి, మొక్కజొన్న వంటి పంటలు చేశాడు. ఐదేళ్లుగా పంటలు కలిసిరాక అప్పులు మరింత పెరిగిపోయాయి. దీంతో ఇల్లు కూడా కుదువపెట్టాడు. దీంతో తీవ్రమైన మనో వ్యధకు గురయ్యాడు. శుక్రవారం తెల్లవారు జామున ఇంట్లో కొక్కెంకు పంచెతో ఉరివేసుకున్నాడు. నిద్రలేచిన భార్యాపిల్లలు చూసి ఇరుగుపొరుగు వారి సాయంతో జగన్‌ను కిందకు దించారు. హుటాహుటిన కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుమారు రూ. 15 లక్షల అప్పు ఉందని రైతు భార్య ఉరుకుందమ్మ తెలిపింది. వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న పార్వతి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడికల్లు గ్రామంలో పార్వతి అనే మహిళ శుక్రవారం గొంతు కోసుకుంది. గ్రామస్థులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ అంజినయ్య భార్య నాలుగేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఆరోగ్యం బాగుపడలేదు. దీంతో పార్వతి మన స్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు, కుటుంబ సభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులను శాస్త్రవేత్తలుగా చేయాలి



మాట్లాడుతున్న డీఆర్సీ కేంద్రం డీడీఏ శ్రీలత

- డీడీఏ శ్రీలత

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో మెలకువలు నేర్పిస్తూ రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేయాల్సిన బాధ్యత ఏఈవోలు, వీహెచ్ఏలది అని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శ్రీలత అన్నారు. శుక్రవారం ఏడీఏ కార్యాలయం ఆత్మ భవనంలో సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బందికి రబీ సీజన్ పంటల సాగుపై శిక్షణా తరగతులను ఏడీఏ అరుణకుమారి అధ్యక్షతన నిర్వహించారు. రబీలో ప్రధానమైన పంటల సాగులో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందేలా సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పప్పుశనగ, వేరుశనగకు సోకే తెగుళ్లు, పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేవీకే శాస్త్రవేత్త రాఘవేంద్ర వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశ్వర్లు, కౌతాళం ఏవో శేషాద్రి, పెద్దకడబూరు ఏవో ప్రసాద్ పాల్గొన్నారు.

20 మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అనంతపురం రేంజ్ పరిధిలో 20 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డా.కోయ ప్రవీణ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల పని తీరుపైన దృష్టి పెట్టిన ప్రభుత్వం వైసీపీకి అండగా నిలిచిన పోలీసులపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో కొంత మంది సీఐలను బదిలీ చేశారు. అయితే ఈ బదిలీల్లో కూడా వైసీపీకి అంటకాగిన సీఐలకు పోస్టింగ్ దక్కడం విశేషం. గతంలో వైసీపీ హయాంలో ఓ మంత్రి నియోజకవర్గంలో పని చేసిన సీఐ వైసీపీ ఎమ్మెల్యే టికెట్ ఆశించినట్లు అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. ఆ సీఐకి ప్రస్తుతం ప్రధాన స్టేషన్‌ను కేటాయించడం విశేషం.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వి.శ్రీనివాసులు	సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, కర్నూలు	ఎమ్మిగనూరు యూపీఎస్
ఎ.వేణుగోపాల్	వీఆర్, కర్నూలు	సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్, కర్నూలు
కే.ప్రవీణ్ కుమార్	సీసీఎస్-2, కర్నూలు	బనగానపల్లె యూపీఎస్, నంద్యాల
ఎన్.కృష్ణయ్య	బనగానపల్లె యూపీఎస్, నంద్యాల	సీసీఎస్-3 నంద్యాల
ఎస్.మహ్మద్ ఆలీ	వీఆర్, కడప	మన్నూరు యూపీఎస్, అన్నమయ్య జిల్లా
డి.రామాంజనేయుడు	మన్నూరు యూపీఎస్, అన్నమయ్య జిల్లా	వీఆర్, అన్నమయ్య
బి.లక్ష్మన్న	ఉమెన్ పీఎస్, చిత్తూరు జిల్లా	మొలకలచెరువు సర్కిల్, అన్నమయ్య జిల్లా
పి.రాజా రమేష్	మొలకలచెరువు సర్కిల్, అన్నమయ్య జిల్లా	ఎస్‌బీ-3, అన్నమయ్య
డి.మురళీధర్ రెడ్డి	కర్నూలు త్రీటౌన్ పీఎస్	సీసీఎస్-2, కర్నూలు
పి.శేషయ్య	కర్నూలు వన్‌టౌన్ పీఎస్ (అడిషినల్ పోస్టు) అటాచ్డ్ టూ సీసీఎస్ కర్నూలు	కర్నూలు త్రీటౌన్ పీఎస్
పి.నాగశేఖర్	పీసీఆర్, ఆదోని, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్ పీఎస్ అడిషినల్ పోస్టు
ఎం. సోనక్క	వీఆర్, కర్నూలు	పీసీఆర్, ఆదోని, కర్నూలు
బి.వెంకట చలపతి	ఎస్‌బీ-3, అన్నమయ్య	ఆలూరు సర్కిల్, కర్నూలు
కే.శ్రీనివాస నాయక్	ఆలూరు సర్కిల్, కర్నూలు	వీఆర్, కర్నూలు
ఎ.మోహన్ కుమార్	డీసీఆర్‌బీ, అన్నమయ్య	ఉమెన్ పీఎస్-2, అన్నమయ్య (మదనపల్లి ట్రాఫిక్)
కే.ఎరిషావలి	డీఎస్‌బీ-2, నంద్యాల	మదనపల్లి వన్‌టౌన్ పీఎస్, అన్నమయ్య
ఎ.చాన్ బాషా	మదనపల్లి వన్‌టౌన్ పీఎస్, అన్నమయ్య	వీఆర్, అన్నమయ్య
ఎ.సత్యనారాయణ	వీఆర్, అన్నమయ్య	డీఎస్‌బీ-2 అన్నమయ్య
జే.శంకరయ్య	డీఎస్‌బీ-2, అన్నమయ్య	డీసీఆర్‌బీ, అన్నమయ్య
జి.మారుతి శంకర్	వీఆర్, కర్నూలు	సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైమ్ సెల్, నంద్యాల

అసభ్యకర పోస్టులు దారుణం : ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ శబరి

నంద్యాల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వైసీపీ అసభ్యకర పోస్టులు పెట్టడం దారుణమని నంద్యాల ఎంపీ, లోక్‌సభ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. నంద్యాలలోని స్వగృహంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ అధికారం పోయిందన్న అక్కసుతో వైసీపీ నాయకులు సోషల్ వీడియాలో టీడీపీ, జనసేన మహిళలపై అసభ్యకరంగా రాస్తూ పోస్టులు పెట్టడం బాధాకరమన్నారు. పోస్టింగ్‌లు చూస్తే వైసీపీ నాయకులు మనషులేనా? అన్న సందేహం కలుగుతోందన్నారు. డిప్యూటీ సీఎం కూతుర్లపై, హోం మంత్రి అనితపై సోషల్ మీడియా పోస్టింగ్‌లను చూస్తే వైసీపీ వాళ్ల అరాచక నైజమేమిటో అర్థమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా నిలుస్తామన్నారు. మహిళల జోలికొస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

మురుగు విషయంలో బంధువుల గొడవ

- కొడవలితో దాడి, ఒకరికి గాయాలు

పత్తికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్కరాళ్ల గ్రామంలో ఇంటిముందు మురుగు విషయంలో జరిగిన గొడవలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. నెట్టెకంఠయ్య అనే వ్యక్తిపై చిన్నాన్న పెద్దనాన్న పిల్లలైన రాజు, అయ్యప్ప కొడవలితో దాడిచేశారు. ఇంటిముందు మురుగు విషయంలో మాటామాటా పెరిగి దాడి తీసింది. గాయపడ్డ నెట్టెకంఠయ్యను పత్తికొండ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాన్ టీచింగ్ పోస్టుల్లో అమలుకాని ఇన్ సర్వీస్



జిల్లా సమగ్ర శిక్షణా కార్యాలయం

- ఫైనల్ జాబితాలో కనిపించని పేర్లు
- న్యాయం చేయాలంటున్న అభ్యర్థులు

ఆలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష పరిధిలో ఉన్న కేజీబీవీ, మోడల్ గర్ల్స్ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీలో ఇన్‌సర్వీస్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. శుక్రవారం విడుదల చేసిన ఫైనల్ జాబితాలో తమ పేర్లు కనిపించలేదని వారు తీవ్ర ఆందోళన చెందారు. జిల్లాలో మోడల్ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న 6వార్డెన్ పోస్టులు, కేజీబీవీ మోడల్ హాస్టల్స్‌లో ఖాళీగా ఉన్న 51పోస్టులలో చౌకిదార్, వాచ్‌మెన్‌లు, స్కావెంజర్, కుక్స్ భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు.. అయితే టీచింగ్‌లో మాత్రమే సర్వీస్ పాయింట్లు పరిగణలోకి తీసుకోగా నాన్ టీచింగ్ పోస్టల భర్తీలో విద్యాశాఖ అధికారులు సర్వీస్ పాయింట్లు పరిగణనలోకి తీసుకోకపోవడంతో ఏళ్ళ తరబడి డైలీ వేజెస్ విధానంలో విధులు నిర్వహిస్తున్న చిరుద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారు.. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీలో ప్రధానంగా వయసు, కుల ప్రాతిపదికన పోస్టు భర్తీ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శ్యామ్యూల్ పాల్ తెలిపారు.. ఇన్నాళ్లు తాము చేసిన సేవలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి అనుభవం లేని వారికి పోస్టులు కేటాయించారని అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రోజు కూలీ పద్ధతిలో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇన్‌సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకొని వారిని న్యాయం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

అసభ్యకర పోస్టులపై చర్యలు తీసుకోండి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తెలుగు యువత అధికార ప్రతినిధి బత్తిన లోక్‌నాథ్



పత్తికొండలో ఫిర్యాదు చేస్తున్న బత్తిన లోక్‌నాథ్

పత్తికొండ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఐటీ మంత్రి లోకేష్‌పై అసభ్యకరపోస్టులు పెట్టినవారిపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోక్‌నాథ్ కోరారు. శుక్రవారం ఆయన పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారి గౌరవాన్ని కించపరుస్తూ విశాఖకు చెందిన వెంకటేష్, గొల్లపవన్ పోస్టులు పెట్టడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చశారు. వారిపై సైబర్ క్రైం చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జయన్న తెలిపారు.

అరుదైన శస్త్ర చికిత్స

- కాలేయంలో కణితిని తొలగించిన పెద్దాసుపత్రి వైద్యులు



శస్త్ర చికిత్స చేసిన వైద్యులతో రోగి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పాణ్యం మండలం గగ్గటూరు గ్రామానికి చెందిన 35 ఏళ్ల రోగికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జనరల్ సర్జరీ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. శుక్రవారం రోగి డిశ్చార్జి అవుతున్న సందర్భంగా వైద్యులు పత్రికా సమావేశంలో వివరాలు వెల్లడించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రవి గత సంవత్సరం నుంచి కడుపు నొప్పితో బాధపడుతు న్నారు. ఇటీవల నంద్యాల జీజీహెచ్‌కు వెళ్లగా అక్కడి వైద్యులు సిటీ స్కాన్ పరీక్ష నిర్వహించి కాలేయంలో గడ్డ ఉందని, కర్నూలు పెద్దాసుపత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో రోగి గత నెల 5న ఎంఎస్-5వ యూనిట్‌లో చేరారు. ఆ యూనిట్ చీఫ్ డా.కే. మాధవి శ్యామల రోగికి అన్ని పరీక్షలు నిర్వహించారు. కాలేయంలో 18 సెంటిమీటర్ల మ్యూసినస్ సిస్ట్ (కణితి) అడినోమా ఉన్నట్లు గుర్తించారు. ఇది కాలేయం ఎడుమ లోబు మొత్తం ఆక్రమించింది. దీంతో రోగికి సర్జరీ చేయాలని యూనిట్ చీఫ్ డా.మాధవీ శ్యామల నిర్ణయించారు. గత నెల 16వ తేదీన డా.మాధవీ శ్యామల, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.చంద్రారెడ్డి, డా.శృతి, అశ్విని సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.సురేష్ కుమార్ సహకారంతో కాలేయంలోని గడ్డను తొలగించి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్ చేయడానికి దాదాపు 5 గంటలు పట్టిందని, కాలేయంలో 15 సెంటిమీటర్ల కణితి ఉండటం ఇప్పటి వరకూ చూడలేదని డా.మాధవి శ్యామల తెలిపారు. రోగి ఆరోగ్యంగా ఉండటంతో డిశ్చార్జి చేశామని తెలిపారు.

గౌరు చరిత సమక్షంలో టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలంలో వైసీపీకి ఎదురు దెబ్బ తగిలింది. నన్నూరు గ్రామ వైసీపీ ఎంపీటీసీతో పాటు 40 కుటుంబాలు పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. శుక్రవారం తన స్వగృహంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ కండువా వేసి ఎమ్మెల్యే వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారి లో వార్డ్ మెంబర్ రామకృష్ణ, మాజీ వార్డ్ మెంబర్ రాముడు, కిట్టు, మార్కండేయులు, షేక్షావలి, పాపన్న, చాకలి ఎల్లప్ప, కె.రామాంజనేయులు, కె.నాగరాజు, శేషన్న ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, విజయుడు, సర్కార్, శ్రీపతి పాల్గొన్నారు.

కాల్వబుగ్గ రామేశ్వరుడి సన్నిధిలో మల్లెల



శివునికి పూజలు చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వర స్వామి వారిని టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ శుక్రవారం దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె లక్ష్మీనరసింహశర్మలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివుడికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. ఆయన వెంట కాల్వబుగ్గ మాజీ చైర్మన్లు చంద్రపెద్దస్వామి, సుధాకర్, నాయకులు కేవీ మధు, కాటినేని నారాయణ, బజారు, జయకృష్ణ ఉన్నారు.

జీజీహెచ్‌లో రేడియాలజీ దినోత్సవం



రాంట్‌జన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

కర్నూలు హస్పిటల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు సర్వజన వైద్యశాలలో అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రేడియాలజీ విభాగంలో రాంట్జన్ విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ వీ.వెంకటేశ్వర్లు, రేడియాలజీ హెచ్‌వోడీ డా.రాధారాణి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఒకప్పుడు ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ పరీక్షల రిపోర్టుల కోసం మరుసటిరోజు రావాల్సి వచ్చేదని, ఇప్పుడు కేవలం గంట వ్యవధిలోనే వాటిని అందజేస్తున్నామన్నారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.హేమనళిని, రేడియాలజి అసోసియేట్ ప్రొఫెసర్ హరినాథ్, శివబాల పాల్గొన్నారు.

పొదుపు మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

సి.బెళగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏపీఎం రమేష్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీపీ బొంతల మునెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రమేష్ మాట్లాడుతూ మండలంలోని పొదుపు మహిళలకు 23.50 కోట్ల రుణాలు పలు రకాలు వ్యాపారాల నిమిత్తం అందజేశామన్నారు. అనంతరం ఏపీవో రామన్న మాట్లాడుతూ ఉపాధి పథకంలో భాగంగా సీసీ రోడ్ల పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసెనాయక్, వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ రెడ్డి మాట్లాడారు. సమావేశంలో పలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ హాజరయ్యారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

ఉలిందకొండ, చిన్నటేకూరులో నివాసాల మధ్యే చెత్త కుప్పలు

కల్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చెత్తతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. 2014-19 ఏడాది అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం రూ.లక్షల నిధులు వెచ్చించి చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగమయ్యాయి. కూటమి ప్రభుత్వం పల్లెల్లో పోగయ్యే చెత్త నుంచి సంపద సృష్టించాలనే లక్ష్యంతో జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చి క్షేత్ర స్థాయిలో పథకాన్ని కార్యాచరణలో పెట్టాలని సూచించింది. కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్తసంపద కేంద్రం నిరుపయోగంగా మారింది.



అలంకార ప్రాయంగా ఉలిందకొండ చెత్త సంపద కేంద్రం



చిన్నటేకూరులో రోడ్డు పక్కన పారవేసిన చెత్త

ఉలిందకొండ, చిన్నటేకూరులో ఇళ్ల మధ్యే చెత్త

కల్లూరు మండలం పరిధిలోని చెత్తసంపద కేంద్రాలు పనిచే యడం లేదని ప్రజలు ఆరోపిస్తు న్నారు. గ్రామ పంచాయతీలోని గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన తడిచెత్త, పొడిచెత్త సంపద కేంద్రాలను తరలించడంలో సిబ్బంది విఫలం అవుతున్నారు. ఇంటింటి చెత్త సేకరణ అనంతరం సమీపంలోని కాలనీల్లో పార వేస్తుండటం అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. ఉలిందకొండ ఎస్సీ కాలనీ, ఆటోస్టాండ్ సమీపంలో చెత్తను సిబ్బంది డంప్ చేస్తుండగా పందులకు ఆవాసాలుగా మారి దుర్వాసనతో రోగాలబారిన పడుతు న్నా మని ప్రజలు వాపోతున్నారు. చిన్నటేకూరు నుంచి బస్తిపాడు రహదారిలో సిబ్బంది చెత్తను పారవేయగా పందులు సంచరించడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు



చెత్తపంపద కేంద్రాల్లో సేకరించిన తడి, పొడి చెత్త వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేయాలి. చెత్త సేకరణర చేపట్టినా సంపద కేంద్రాలకు రావడం లేదు. గ్రామాల్లో అక్కడక్కడా డంప్ చేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

\- మద్దయ్య, రైతు

రైతులకు వర్మీకంపోస్టు అందించాలి



ప్రభుత్వం ఉద్దేశం మంచిదే కాని ఆయా కేంద్రాల్లో చెత్త సంపద తయారు కావడం లేదు. తడి, పొడి చెత్తవేరు చేసి ఏర్పాటు చేసిన తొట్లలో వర్మీకం పోస్టు తయారీ చేసి రైతులకు అందించాలి. ప్రకృతి వ్యవసాయంలో నాకు అవగాహన ఉంది. వానపాములతో తయారు చేసే ఎరువులు పంటలకు జీవం పోస్తాయి.

\- రంగ లక్ష్మమ్మ, మహిళా రైతు

నేడు ఉర్దూ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ లోక్‌నాథ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ పి.రంజిత్ బాషా, అతిథులుగా ఇన్‌చార్జి ఉపకులపతి పి. షేక్షాషావలి, ఖాన్, ఉస్మానియా కళాశాల కరస్పాండెట్, ప్రిన్సిపాల్స్ హాజరవుతారని తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పందన

గూడూరు నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు స్పందన లభిస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని కెనాగలాపురం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదుపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు.

ఇద్దరికి జరిమానా

కోడుమూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్కూరు వద్ద హంద్రీనది పరిసరాల్లో తహసీల్దార్ వెంకటేశ్‌నాయక్ శుక్రవారం తనిఖీ చేపట్టి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రత్యేక ఓటరు నమోదును వినియోగించుకోండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటరు నమోదును వినియోగించుకోవాలని నగర పాలక కమిషనర్, కర్నూలు నియోజకవర్గ ఎన్ని కల రిటర్నింగ్ అధికారి ఎస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం ఆయన నగర పాలక కార్యాల యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో, కౌన్సిల్ హాలులో బీఎ ల్వోలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. రాజకీయ పార్టీలతో కమిషనర్ మా ట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. ఈ నెల 9, 10 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు (ఫారం-6) ఓటు తొలగింపు (ఫారం-7) వివరాల మార్పు నకు (ఫారం-8) దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. అనంతరం కమిషనర్ బీఎల్వో లతో మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్వోలు రెండు రోజులపాటు అందుబాటులో ఉండాలని ఎటువంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తులు స్వీకరిం చాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఆర్వో, తహసీల్దార్ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్ బాషా, వాజీద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

గూడూరు: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా 9, 10 తేదిలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

కోడుమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శుక్రవా రం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 28 వేల మంది వీవోఏలు ఉన్నారని అన్నారు. పొదుపు సంఘాల మహిళలకు ఎంతో కాలంగా సేవలు అందిస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయంలో మూడు సంవత్సరాలు అనుభవం ఉన్న వీవోఏలను తొలగించడం అన్యాయం అని అన్నా రు. అనంతరం తహసీల్దార్ వెంకటేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గఫూర్‌మియా, వీవోఏలు వెంకటస్వామి, రామచంద్రుడు, మారెప్ప, ఉమాదేవి, గాయత్రి, తిరుమల పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి: ఎంఈవో



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈవో

ఓర్వకల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పూడిచెర్ల ఉర్దూ, ఎంపీయుపీ కేతవరం పాఠశాలలను అకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జాతీయ సేవా పథకానికి ఆర్‌యూ విద్యార్థులు



విద్యార్థులతో ఆర్‌యూ వీసీ, రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రీ రిపబ్లిక్‌డే పెరేడ్ (జాతీయ సేవా పథకానికి) క్యాంపునకు ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు అభినందించారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎకే. హర్షవర్ధన్, వి.కళ్యాణిలు ఎంపికయ్యారని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి. నాగరాజు తెలిపారు. కేబీసీ నార్త్ మహారాష్ట్ర విశ్వ విద్యాలయం జలగావ్ జిల్లాలో ఈ నెల 12 నుంచి 21 వరకు జరిగే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు విద్యార్థులు హాజరవుతారని తెలిపారు.

విద్యుత్ చార్జీలపై సీఎం సమాధానం చెప్పాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్



మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు ఎందుకు పెంచారో సీఎం చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 14 వరకు నిర్వహించే ప్రజాపోరు యాత్ర శుక్రవారం నగరంలోని పలు కాలనీల్లో ప్రారంభించారు. ఒకటో వార్డు ఖండేరీలో జరిగిన కార్యక్రమంలో గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిం చిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రెండేళ్ల తరువాత ప్రజలపై భారాలు వేస్తే ఈ కూటమి ప్రభుత్వం కేవలం మూడు నెలలకే అధిక భారాలు మోపుతుందన్నారు.



అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి: నోడల్ ఆఫీసర్

ఓర్వకల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లోని నిరక్షరా స్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని నంద్యాల జిల్లా వయోజన విద్య నోడల్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం కార్యాలయంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటరీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి హాజర య్యారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్రామిరెడ్డి, సీసీలు, వీవోఏలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

కల్లూరు: అక్షరాస్యతతోనే మహిళల సాధికారికత సాధ్యమని ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలోని బీసీ స్టడీసర్కిల్‌లో వయోజన విద్య, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉల్లాస్ అందరికీ అక్షరాస్యత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. వివిద గ్రామాల నుంచి వచ్చిన వలంటరీ టీచర్లకు, గ్రామస్థాయిలో ఎంపికైన నిరక్షరాస్యత మహిళలకు ఆర్థిక అక్షరా స్యతపై శిక్షణ ఇచ్చారు. వెలుగు ఏపీఎం పుష్పావతి మాట్లాడుతూ గ్రామీణ మహిళలకు సంపూర్ణ అక్షరాస్యతను అందించడమే లక్ష్యమన్నారు. ఉల్లాస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, సీసీలు, వీఓఏలు వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం పుష్పవతి

సి.బెళగల్: స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు నిరక్షరాస్యతపై శిక్షణను ఏపీఎం రమేష్, ఎంపీడీవో రాణెమ్మ ఆధ్వర్యంలో ఇచ్చారు. సీసీలు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

'ధర్నాను జయప్రదం చేయండి'

కర్నూలు న్యూసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 11న కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్య దర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీని సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగమద్దయ్య, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, రామాంజనేయులు, నల్లన్న పాల్గొన్నారు.

పైప్‌లైన్ల మరమ్మతులు పూర్తి చేయాలి: నగరంలో పైప్‌లైన్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ బీవై.రామయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐదు రహదారుల కూడలిలో జరుగుతున్న పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంట్‌కోత ఉంటుందని ఏడీఈలు నాగప్రసాద్, రాజేంద్రబాబు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

కర్నూలు లీగల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిం చారు. స్థానిక యునైటెడ్ క్లబ్ ఆవరణలో టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్య క్షుడు కేఈ జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు మురళి మనోహర్, టి.నాగభూషణం నాయుడు, వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన చంద్రకాంత్

కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ కలిశారు. శనివారం విజయవా డలోని సచివాలయంలో జిల్లాలో టీడీపీ సభ్యత్వ నమోదుతోపాటు పార్టీకి చేస్తున్న సేవలను చంద్రబాబుకు వివరించారు.

ఎస్టీ రిజర్వేషన్‌పై ప్రస్తావించండి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో వాల్మీకుల ఎస్టీ అంశాన్ని ప్రస్తావించాలని కోరుతూ సంఘం నాయకులు శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన పార్టీ కోఆర్డినేటర్ చింతా సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తలారి కృష్ణ నాయుడు, ఎల్లమ్మ గుడి మాజీ చైర్మన్ బేతంకృష్ణుడు, మహర్షి రమణ, మండ్ల శేఖర్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలి

కల్లూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలను ఎన్డీఏ కూటమి నాయకులు అమలు చేయాలని సీపీఎం నాయకుడు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని 36, 37 వార్డులు వీకర్‌సెక్షన్ కాలనీలో ప్రజాపోరు యాత్రను చేపట్టారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని, బెల్టు షాపులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ బీడీ వర్కర్స్ కాలనీ, సూర్యనారాయణగనర్, డిష్ ఏరియా ప్రాంతాల్లో యాత్ర నిర్వహించారు. నగర కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో అలివేలమ్మ, అరుణ, కె.సుధాకరప్ప, ప్రభాకర్ పాల్గొన్నారు.

14న విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

కోడుమూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 14 నుంచి స్కూల్ హెల్త్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయ వైద్య సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లతోపాటు ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లోని పిల్లలు, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అలాగే ఇంటింటికీ తిరిగి 18 సంవత్సరాలు దాటిన వారందరికీ క్యాన్సర్ పరీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణ వీధుల్లో పర్యటించి పరిశుభ్రత, పారిశుధ్యంపై తీసుకోవాల్సిన జాగ్ర త్తలపై ప్రజలకు సూచనలిచ్చారు. పంచాయతీ కార్యదర్శి అజయ్ భాస్కర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు

సి.బెళగల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల సెపక్‌తక్రా పోటీలు సి.బెళగల్ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో శనివారం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. క్రీడా మైదానాన్ని పీఈటీ, ఉపాధ్యాయులు శుభ్రం చేశారు.

శాంతి భద్రతలపై జగన్ ప్రశ్నించడమా?

● జగన్‌పై మండిపడిన సోమిశెట్టి

కర్నూలు అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలపై ప్రశ్నించే అర్హత పులివెందుల ఎమ్మెల్యే జగన్‌కు లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని సమూలంగా దోచిన గజగొంగ జగన్ అని మండిపడ్డారు. వైసీపీ సోషియల్ మీడియా, పేటీఎం బ్యాచ్‌లు పోస్టింగ్‌లు పెట్టి సునకానందం పొందుతున్నాయని అన్నారు. తప్పుడు పోస్టింగులకు ఫుల్ స్టాప్ పెట్టకపోతే రానున్న రోజుల్లో ప్రజల నుంచి చెప్పు దెబ్బలు తప్పవని హెచ్చరించారు. కర్నూలు నగరాభివృద్ధే లక్ష్యంగా మంత్రి టీజీ భరత్ పని చేస్తున్నారని అన్నారు. వైసీపీ నాయకులు టీజీ భరత్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. మరోసారి తప్పుడు ఆరోపణలకు పూనుకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

ఆలయానికి రూ.18.18 లక్షల ఆదాయం

ఓర్వకల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో శనివారం దేవదాయ, ధర్మదాయ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాల్వబుగ్గ ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో శుక్రవారం వేలంపాటలు నిర్వహించారు. ఈ వేలం పాటలను దక్కించుకునేందుకు ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చారు. ఎస్ఐ సునీల్ కుమార్ గట్టి బందోబస్తు నిర్వహించారు. గత ఏడాది 14,33,400లు వేలం రాగాఈ ఏడాది వేలం పాటల ద్వారా రూ.18,18,500 ఆదాయం సమకూరింది. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.3,85,100 ఆదాయం వచ్చినట్లు ఏవో తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కాల్వబుగ్గ మాజీ చైర్మన్లు చంద్రపెద్దస్వామి, సుధాకర్, ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణశర్మ, కల్లె లక్ష్మీనరసింహశర్మ, నాయకులు కేవీ మధు, ఆకుల మహేష్, కాటినేని నారాయణ, బజారు, జయకృష్ణ, గువ్వ రవికుమార్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ కోటా పెంచడం అభినందనీయం

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా రిజర్వేసన్ పెంచడం అభినందనీయమని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. వివిధ క్రీడాంశాలలో ప్రతిభ చాటిన అన్ని ఉద్యోగాలలో ఇలాంటి సౌకర్యం కల్పించినందున క్రీడాకారులు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారన్నారు. డీఎస్ఏ స్టేడియంలో క్రీడా కారులు, కోచ్‌లు, డీఎస్‌డీవోలు ముఖ్యమంత్రి ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహించారు. సీఎంకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విజేతకు డీఈవో అభినందన

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాకినాడలో నిర్వహించిన అండర్-17 టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు డి.సాయి శంకర్ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించారు. డి.సాయి శంకర్ ఎ.క్యాంపు మాంటి స్సోరి పాఠశాల విద్యార్థి. ఈ సందర్భంగా డీఈవో ఎస్.శ్యామ్యూల్ పాల్ తన చాంబరులో అభినందనలు తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గిడ్డయ్య, పరమేష్, సుంకారావు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై అవగాహన ఉండాలి

తుగ్గలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు ఉపాధి పనుల కల్పనపై అవగాహన కలిగి ఉండాలని ఏపీవో హేమసుందర్, ఈసీ ప్రదీప్ కుమార్ సూచించారు. శుక్రవారం తుగ్గలి ఏపీవో కార్యాలయంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ముందుగా పనులు గుర్తించి ఆన్‌లైన్ చేసి మంజూరైన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ప్రారంభానికి ముందు, పనులు చేసేటప్పుడు ఫొటోలు తీసుకోవాలని, రికార్డులు మెయింటెనెన్స్ చేయాలన్నారు.

గుండెను కాపాడుకోవాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుండెను కాపాడుకోవాలని, జీవన శైలి మార్చుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో శుక్రవారం నవ భారత్ వెల్ఫేర్ సొసైటీ నంద్యాల జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్ నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉదయం లేచిన దగ్గరనుంచి పరుగులు పెట్టే జీవనవిధానంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ గోవర్ధన్‌నాయుడు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి : వీరభద్ర గౌడ్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

హాలహర్వి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గూళ్యం గాలిలింగేశ్వర ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. పదవులు భర్తీ చేస్తారని, నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పించాలన్నారు. మల్లన్న, లింగమల్లప్ప పాల్గొన్నారు.

పోరుబాటను జయప్రదం చేయండి

ఆదోని రూరల్ నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 వరకు నిర్వహించే పోరుబాటను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న కోరారు. శుక్రవారం మాట్లాడుతూ, అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలపై దాడులు, విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా సీపీఎం నిర్వహిస్తున్న పోరుబాటను జయప్రదం చేయాలని కోరారు.

నిర్మించారు.. ప్రారంభించరా?



ప్రారంభానికి నోచుకోని కాంప్లెక్స్

• 2018లో పంచాయతీ దుకాణాల నిర్మాణం

ఆలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని సంత మార్కెట్‌లో 2018లో రూ.1.20 కోట్ల వ్యయంతో 27 దుకాణలను నిర్మించారు. అయితే వీటిని ప్రారంభించకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. మూడు నెలల క్రితం షాపింగ్ బహిరంగ వేలాలు నిర్వహించేందుకు పంచాయతీ అధికారులు డిపాజిట్లు తీసుకున్నా ముందురోజు అధికార పార్టీనేతలు ఒత్తిడి చేయించి వాయిదా వేయించారు.

సిండికేట్ కోసమే వాయిదా..?

దుకాణాలకు 2022 మార్చి 24న వేలం నిర్వహించినా వైసీపీ, టీడీపీ నాయకులు మధ్య ఘర్షణ తలెత్తి వాయిదే వేశారు. అనంతరం ఈ ఏడాది ఆగస్టు నెల 27న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినా అధికార పార్టీ నేతలు అడ్డుకున్నారు. మరో వైపు అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు చిరు వ్యాపారుల నుంచి ముందస్తుగా అడ్వాన్సు కూడా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు దుకాణాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు కేటాయించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి రామాంజినేయులు అధికారులను కోరినట్లు సమాచారం.

వేలానికి అడ్డంకులు

బహిరంగ వేలం నిర్వహిస్తే తాము కుదుర్చుకున్న లోపాయకారీ ఒప్పందం బెడిసి కొడుతుందని భావించి అధికార పార్టీ నాయకులే వాయిదా వెయించినట్లు చర్చ సాగుతోంది.

మరోవైపు డిపాజిట్లు కట్టిన చిరు వ్యాపారాలు మాత్రం వేలం వాయిదా పడడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.. వారం క్రితం జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ దుకాణాలను పరిశీలించి, ఎందుకు ప్రారంభించ లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నెలలో ప్రారంభించాలని ఆదేశించారు.

కాంప్లెక్స్‌ను ఆరంభించండి



జాతీయ రహదారి ఏర్పాటుతో రోడ్డుసైడ్ వ్యాపారులు ఉపాధి కోల్పోయారు. షాపింగ్ కాంప్లెక్స్‌కు బహిరంగ వేలం నిర్వహిస్తే అందరికీ న్యాయం జరుగుతుంది.
- నారాయణ స్వామి, సీఐటీయూ నాయకుడు

నెలలో ప్రారంభిస్తాం



కాంప్లెక్స్ బహిరంగ వేలం పాటలు కొన్ని కారణాలతో వాయిదా పడ్డాయి. డీపీవో ఆదేశాల మేరకు సర్పంచ్‌తో చర్చించి నెలలోపు ప్రారంభించేలా చూస్తాం.
- ప్రభాకర్ ఈవో ఆలూరు గ్రామ పంచాయతీ

పంటల బీమా తప్పనిసరి

తుగ్గలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రబీలో పంటలకు బీమా తప్పనిసరిగా చేయాలని ఏవో పవన్ కుమార్ సూచించారు. శుక్రవారం తుగ్గలి వ్యవసాయ కార్యాలయంలో పంటల బీమాపై వ్యవసాయాధికారులకు, రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనగ ఎకరాకు రూ.420, వరి రూ.630, జొన్న రూ. 297, వేరుశనగ రూ.480, ఉల్లి రూ. 1350 టమోటాకు ఎకరాకు రూ.1,500 ప్రిమియంను డిసెంబరు 15లోపు చెల్లించాలన్నారు. ప్రిమియం చెల్లించిన రైతులకు భీమా వర్తిస్తుందన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మద్దికెర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మజరా గ్రామం బొజ్జనాయుని పేటలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయితీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. ఈ నెల 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'దాహం.. దాహం' శీర్షికన కథనం ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. బోరుకు మరమ్మ తులు చేసేందుకు సిబ్బందిని పంపారు. బోరులో ఆకతాయిలు రాళ్లు వేయడంతో ఇబ్బంది తలెత్తింది. మరమ్మతులు చేసి నీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా శుక్రవారం తెలిపారు. వివరాల మేరకు.. పట్టణంలోని బావాజీపేటలోని ఇంట్లో గొల్ల విజయ్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. 197 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు.

'ఉల్లాస్'తో మహిళల్లో వెలుగులు

దేవనకొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చదువురాని మహిళల జీవితాల్లో ఉల్లాస్‌తో వెలుగులు నింపనున్నట్లు విద్యాశాఖ సూపర్‌వైజర్ రమణయ్య, ఈవోఆర్‌డీ సూర్యనారాయణ తెలిపారు. స్త్రీ శక్తిభవన్‌లో వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఒక్కో వలంటీర్ పదిమంది మహిళలకు రాయడం, చదువడం, లెక్కలు నేర్పించాలని సూచించారు. మండల సమాఖ్య హెచ్‌డీ నరసన్న పాల్గొన్నారు.

చీరాలకు తరలి రండి..

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు నేడు తలపెట్టిన చలో చీరాలకు భారీగా తరలిరావాలని మాల మహనాడు పట్టణ అధ్యక్షుడు బొబ్బిలి పిలుపు నిచ్చారు. శుక్రవారం మాల మహానాడు కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. రాజకీయ నాయకులు వారి స్వార్థం కోసం ఐక్యంగా ఉన్న మాల, మాదిగలను విడదీయడం అన్యాయం అన్నారు. నాయకులు సాయిరాం, మహానంది, కేశవ మాస్టర్, వెంకటేశులు, నరేష్ కుమార్, రాము, గిరప్ప వీరేష్ నాగరాజు పాల్గొన్నారు.

కూలిన వంతెన

• గిరిగిట్ల-అమీనాబాద్ రాకపోకలు బంద్

తుగ్గలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిగిట్ల-అమీనాబాద్ వతెన శుక్రవారం రాత్రి కూలిపోయింది. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయి ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. లింగాలవాగుపైన నిర్మించిన వంతెన మీదుగానే అమీనాబాద్, పగిడిరాయి, చెన్నంపల్లి, రామలింగాయపల్లె తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళ వంతెన కూలడంతో ఎటు వెళ్లాలో అర్థం గాక ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

భూ సమస్యలను పరిష్కరిస్తాం



వినతులను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ భరద్వాజ్

ఆదోని రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రీసర్వేతో నష్టపోయిన రైతుల సమస్యలను పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం మాంత్రికి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు సబ్‌కలెక్టర్ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దార్ శివరాముడు, రీసర్వే డీటీ పెద్దయ్య పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తరలించాలి

హొళగుంద, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తేరుబజార్ ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, దళిత సమాఖ్య నాయకులు లింగం ఫల్ల వెంకటేష్, నాగరాజు, రవి, మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడుతూ పాఠశాల, గుడి దారిలో ప్రోహిబిషన్ అధికారులు ఎలా అనుమతించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలూరు ఎక్సైజ్ సీఐ లలితను వివరణ కోరగా నిబంధనల మేరకు అనుమతించామని, పాఠశాలకు వంద మీటర్ల దూరం ఉందని తెలిపారు.

దుష్ప్రచారంపై చర్యలు తీసుకోండి

వెల్దుర్తి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రామళ్లకోట టీడీపీ నాయకుడు శశికళాధర్ వెల్దుర్తి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్రం, నిజమాబాద్‌కు చెందిన అశోక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేశారు.

సభ్యత్వ నమోదులో టాప్‌లో నిలుద్దాం



సభ్యత్వ నమోదు చేస్తున్న మాజీ జడ్పీటీసీ పురుషోత్తం చౌదరి

మద్దికెర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలలాన్ని టీడీపీ సభ్యత్వ నమోదులో జిల్లాలోనే టాప్‌లో నిలిపేందుకు కార్యకర్తలు కృషి చేయాలని మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి పిలుపునిచ్చారు. శుక్రవారం పెరవలి గ్రామంలో సభ్యత్వ నమోదును చేపట్టారు. కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో ముందుకు సాగుదామన్నారు. ఆలయ మాజీ చైర్మన్ అంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, పంచాయితీ సభ్యులు మైలా ప్రభాకర్, బూత్ కన్వీనర్ చాకలి రాము, హనుమంతు, అగ్రహారం ఆనంద్, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు యువతకు ఇవ్వాలి



తిక్కారెడ్డితో మిద్దె వెంకటేశ్

తుగ్గలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులు యువతకు ఇవ్వాలని టీడీపీ యువ నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్ కోరారు. శుక్రవారం కర్నూలులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిని కలిసి విన్నవించామన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నియోజకవర్గంలో యువకులను ప్రోత్సహిస్తున్నారని, అదే తరహాలో నామినేటెడ్ పదవుల్లో కూడా అవకాశం ఇవ్వాలన్నారు. స్పందించిన తిక్కారెడ్డి అదిష్టానం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు.

ఓటరు నమోదు పకడ్బందీగా చేయండి

మద్దికెర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ హుశేన్‌సాహేబ్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. మండలంలో 34 పోలింగ్ బూత్‌లు, 26వేల ఓట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో పోలింగ్ బూత్‌లలో బీఎల్వోలు ఓటు నమోదుకు అందుబాటులో ఉండాలన్నారు. మరణించిన, గ్రామం వదిలి వెళ్లిన వారిపేర్లు తొలగించాలని అన్నారు. 18 ఏళ్ల పైబడిన వారు ఓటరు నమోదు చేసుకోవాలన్నారు. డీటీ శ్రీదేవి, ఆర్ఐ రవికుమార్ ఉన్నారు.

పంచాయతీలకు మంచి రోజులు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతో పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయనీ టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, పత్తికొండ మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ పెద్ద వీరన్న, మండల టీడీపీ అధ్యక్షులు శివప్రసాద్ యాదవ్ అన్నారు. శుక్రవారం ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి వేర్వేరుగా మాట్లాడుతూ 2024-25 సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు బేసిక్ గ్రాంట్, టైడ్ గ్రాంట్ విడుదలయ్యాయన్నారు. బసినేపల్లికి రూ.5,51,269లు, బొమ్మనపల్లికి రూ. 2,41,821లు, బురుజుల రూ.4,48,558లు, హంపా రూ.3,61,720లు, ఎం.అగ్రహారం రూ.10,26,223లు, మద్దికెర రూ.32,12.058లు, పెరవలి రూ.17,42,774లు, ఎడవలి రూ. 3,37,163లు మంజూరయ్యాయని తెలిపారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



వధూవరులను ఆశీర్వదిస్తున్న వైకుంఠం శివప్రసాద్

ఆస్పరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సూచన మేరకు టీడీపీ సభ్యత్వం నమోదును వేగవంతం చేయాలని టీడీపీ మాజీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం తంగరడోన గ్రామంలో టీడీపీ నాయకుడు వెంకటేష్ కుమారుని వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరు లను ఆశీర్వదించారు. మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, బత్తిని జీవన్ కుమార్, అట్టేకల్ రాజశేఖర్, యాగంటి రఘు యాదవ్, కే సంజన్న, ఎంపీటీసీ నరసప్ప, యా గంటి కృష్ణ, సుదర్శన్, శ్రీనివాసులు, రవి, ఓబు లేష్, హంపయ్య, తంగారడోణ మల్లేశ్వప్ప, నూర్ బాషా, మునిస్వామి, కృష్ణ పాల్గొన్నారు

హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న కార్యదర్శి షాబీర్ బాషా

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్‌బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం విశ్వనారాయణ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ పట్టణ జనరల్ బాడీ సమావేశం పట్టణ కార్యదర్శి దస్తగిరి అధ్యక్షతన నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్ బాబు, మండల పట్టణ కార్యదర్శులు కల్లుబావిరాజు, సుదర్శన్, సీనియర్ నాయకుడు లింగప్ప, షాబీర్ బాషా మాట్లాడారు. ఈనెల 12నుంచి జరిగే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలకు విద్యార్థులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

నేడో.. రేపో..

• పట్టణంలో కూలేందుకు సిద్ధంగా పాత భవనాలు

ఆదోని టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పాత కట్టడాలు ప్రమాదకరంగా మారాయి. నేడో రేపో కూలిపోయేలా ఉండటంతో భవనాల పక్కన నడవాలంటే కూడా భయపడాల్సి వస్తోంది. ఆదోని పాత పట్టణ పరిధిలో 50 నుంచి 70 ఏళ్ల క్రితం నిర్మించిన కట్టడాలు 250 వరకు ఉన్నాయి. కొంత మంది పేదలు అందులోనే కాపురముం టున్నారు. మరికొన్ని కోర్టు వివాదాల్లో ఉన్నాయి.



ఎంఎం రహదారిలో ఉన్న పాత కట్టడం

ప్రతి ఏడాదీ ప్రమాదాలు

నాలుగేళ్ళ క్రితం మేతర్ మసీదు వెనుక పాత కట్టడం వర్షాలకు కూలిపోయి పాదచారి మృతిచెందాడు. అలాగే ఏడాద్రికితం మైనార్టీ కాలనీలోని ప్రభుత్వ పట్టాలలో నిర్మించిన ఇంటి పైకప్పు కూలి మహిళ మరణించింది. మరొక ఇంటి పైకప్పు కూలిపోయిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అధికారులు స్పందించి, పాత ఇళ్లల్లో నివసిస్తున్న వారిని తరలించి, భవనాలను కూల్చివేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు ఇచ్చాం



సచివాలయ సిబ్బందితో పాత కట్టడాలను గుర్తించి నోటీసులు ఇచ్చాం. 23, 27, 35 వార్డులలో నాలుగు పాత నిర్మాణాలను గుర్తించాం. సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించాం. **- కృష్ణ, కమిషనర్**

ప్రభుత్వ విద్యార్థులకు నాణ్యమైన విద్య

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

• ఎంఈవో రంగస్వామి



మద్దికెర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిందేందుకు కృషి చేస్తాననీ ఎంఈవో రంగస్వామి అన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల కోసం ఏం చర్యలు తీసుకున్నారు?

జవాబు: మండలంలో 4 జడ్పీ పాఠశాలలు, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాల యంతో మొత్తం 602 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నాము.

ప్రశ్న: మధ్యాహ్న భోజన నాణ్యతను ఎలా పర్యవేక్షిస్తున్నారు.?

జవాబు: ప్రతిరోజు పాఠశాలలను పర్యవేక్షిస్తున్నాం. భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటున్నాము.

ప్రశ్న: పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను సకాలంలో పంపిణీ చేశారా?

జవాబు: సకాలంలో అందజేశాం.

ప్రశ్న: ఉపాధ్యాయుల కొరత ఉందా?

జవాబు: కొరత ఉన్న పాఠశాలలలో సర్దుబాటు కింద ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి ఉపాధ్యాయులను భర్తీ చేస్తున్నాము.

ప్రశ్న: బడిబయట పిల్లలు ఉన్నారా..?

జవాబు: మండలంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి, వారిని పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తారా?

జవాబు: ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేశారు.

ఓటర్ల జాబితా సవరణను వినియోగించుకోండి



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడు

కోసిగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్ల జాబితా సవరణ స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌ను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడు తెలిపారు. శుక్రవారం ఆయన కోసిగిలోని స్త్రీశక్తి భవనంలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటర్ల నమోదు వివరాలు పరిశీలన చేయడమే కాకుండా కొత్త ఓటర్లు నమోదు చేసేందుకు అర్జీలు స్వీకరించాలన్నారు. మండలంలోని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్వో చిరంజీవి, ఆర్ఐ శ్రీరాములు, సీనియర్ అసిస్టెంట్ తిక్కస్వామి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మంత్రాలయం: మండలంలో ఈ నెల 9, 10 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎస్.రవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గురురాజరావు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతి యువకులు తమ ఓటరుగా నమోదు చేసుకోవాలని, తప్పు ఒప్పులు సరి చూసుకోవడం, అడ్రస్సులు మార్పులు, తొలగింపులు చేపడుతారని అన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యావేత్తలు సహకరించి ప్రత్యేక ఓటరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అధికారులు సహకరించకుంటే ఫిర్యాదు చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషఫణి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు రెవెన్యూ అధికారులు సహకరించకుంటే ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడివెళ్ల గ్రామంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చాయన్నారు. రైతులకు రీ సర్వేలో ఏవైనా సమస్యలు ఉంటే గ్రామ సభలో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. గ్రామంలోని వీర్వోలు, సర్వేయర్లు స్పందించకపోతే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సర్వేయర్ వాహిద్, సీనియర్ అసిస్టెంట్ జ్యోతి, టీడీపీ సీనియర్ నాయకులు గొల్ల హనుమంతు, ఎంపీటీసీ హనుమంతు, గుంటెప్ప, నరసన్న, శ్రీనివాసులు, పల్లెపాడు శ్రీనివాసులు, రంగనాయకులు, రంగనాయకులు, రాముడు, హనుమంతు, గోపాల్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఎస్‌వోకు పోస్టింగ్ ఇవ్వడం సరికాదు



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు, విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మిగనూరు పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల ఎస్‌వో కవితకు తిరిగి పోస్టింగ్ ఇవ్వడం సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం ఎస్‌వోకు పోస్టింగ్ ఇవ్వటాన్ని ఖండిస్తూ డీఈవో శామ్యూల్‌పాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శేఖర్ నాయుడు, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఉదయ్, నాయకులు కిట్టు, ఆర్యన్, రామాంజి పాల్గొన్నారు.

తాగునీటి కొళాయిల్లో మురుగు నీరు

● ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
● పట్టించుకోని అధికారులు

గోనెగండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో కొన్ని రోజులుగా తాగునీటి కొళాయిల్లో మురుగునీరు వస్తోంది. గ్రామస్థులు ఆ నీరు తాగేందుకు ఇబ్బంది పడుతున్నారు. పదిరోజులలో మూడు సార్లు నీటి మోటారు కాలిపోవడంతో గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. గ్రామంలో 25 వేల జనాభా ఉంది. ఎస్ఎస్ ట్యాంక్ నుంచే తాగునీరు కొళాయిలకు నీరు సరఫరా అవుతుంది. అయితే సిబ్బంది అశ్రద్ధ కారణంగా కొళాయిలకు గుంతలోని మురుగు నీరు వచ్చి పైపులలో చేరుతోంది. దీంతో దుర్వాసన గల నీరు రావడంతో తాగేందుకు ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు తెలుపుతున్నారు. ఎంత మంది ప్రజాప్రతినిధులు మారినప్పటికి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య తీరలేదు. నాలుగు రోజులకు ఒకసారి వచ్చే నీరు పాచి పట్టి దుర్వాసనతో ఉండటం అదే నీటిని నిలువ ఉంచుకొని వాడుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామంలోని కొన్ని కొళాయిలకు బిరడాలు లేక పోవడం, భూమి మట్టం కంటే లోతులో కొళాయి ఉండటం కారణంగా వర్షపు నీరు, మురుగునీరు కొళాయిల్లోకి వెళ్లి మెయిన్ పైపులోకి ఆ నీరు కలుస్తుంది. దీంతో ఆ నీటిని తాగిన వారు అంటు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కొళాయి గుంతలో నిలిచిన వర్షపునీరు

మంచాలమ్మకు పంచామృతాభిషేకం

మంత్రాలయం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్తీక శుద్ధ సప్తమిని పురస్కరించుకొని మఠం పండితులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు, వెండి ఆభరణాలతోపాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు మహామంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాలనుంచి వచ్చిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుదాఘాతంతో కోడె దూడ మృతి

కోసిగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిర్తనకల్ గ్రామానికి చెందిన జంగం పాలాక్షి అనే రైతుకు చెందిన రూ.లక్ష విలువ చేసే కోడెదూడ శుక్రవారం విద్యుత్ విద్యుదాఘాతంతో మృతి చెందింది. రైతు పాలాక్షి తెలిపిన వివరాలు ఇలా.. శుక్రవారం సాయంత్రం తమ సొంత పొలంలో మేత మేస్తుండగా.. విద్యుత్ పోల్ పక్కనే ఉన్న కరెంటు వైరుకు తగిలి, అక్కడికక్కడే మృతి చెందిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.లక్షకు పైగా విలువ చేసే కోడెదూడ మృత్యువాత పడటంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ అధికారులు, ప్రభుత్వం రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సూపర్ సిక్స్ పథకాలకు ప్రాధాన్యం: బీవీ

నందవరం, నవంబరు 8(ఆంధజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల అమలుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గురుజాల, రాయచోటి గ్రామాల్లో రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో గతుకుల రోడ్లకు పిడికెడు మట్టి వేసిన పాపాన పోలేదన్నారు. వైసీపీ విషప్రచారాలు చేస్తుందని వాటిని తిప్పికొట్టాలని కార్యకర్తలు, నాయకులకు సూచించారు. సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం తూచ తప్పకుండా అమలు చేస్తుందని తెలిపారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రూ. 262 కోట్లతో గోనెగండ్ల జీడీపీ ద్వారా అన్ని గ్రామాలకు శుద్ధజలం అందించేందుకు ప్రతిపాదనలు పంపామని వాటిని త్వరలో మంజురు చేయించి వాటర్‌గ్రిడ్ ద్వారా ప్రతి గ్రామానికి నీరందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు క్లస్టర్ ఇన్‌చార్జిలు కాశీంవలి, ధర్మాపురం గోపాల్, పార్టీ మండల కన్వీనర్ బీవీ రాముడు, చిన్న కొత్తిలి సత్యారెడ్డి సోమలగూడురు వెంకట్రామిరెడ్డి, చాకలి చంద్ర, నదికైరవాడి వీరేష్, ఆదిశేషు, వీరేష్, శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

మండలంలోని గురుజాలలో ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పూజలు చేశారు. ఆలయ పూజరి హంపీస్వామి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ప్రజలు, రైతులు పాడిపంటలతో, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు కాశీంవలీ, ధర్మాపురం గోపాల్, శివారెడ్డి పాల్గొన్నారు.

ఆలయం ప్రారంభోత్సవం

మంత్రాలయం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బన దొడ్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయాన్ని ప్రారంభించారు. శుక్రవారం పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య కర్నాటకలోని ఘబ్బూరు మఠం పీఠాధిపతి భూది బసవేశ్వర మహాస్వాముల ఆధ్వర్యంలో శివలింగం, గణపతి, నంది, నాగమూర్తి, బోడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనను నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి హోమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి హోమానికి పూర్ణాహుతి చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ధ్వజస్థంభానికి ప్రతిష్ఠాపన చేశారు. దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పీఠాధిపతితో పాటు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికి శాలువ, పూలమాలతో సన్మానించారు.



పూర్ణాహుతి చేస్తున్న ఎమ్మెల్యే

వెలగని వీధి దీపాలు

గోనెగండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలోని మెయిన్‌బజార్‌కు వెళ్లే దారిలో వీధిదీపాలు వెలగడం లేదు. ప్రదాన రహదారి కావడతో రాత్రి పూట రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు ఇదే ప్రాంతంతో పెద్ద కొండ ఉండటంతో పాములు, తేళ్లు కూడా సంచరిస్తుంటాయని ఈ ప్రాంత వాసులు వాపోయారు.



ఆకాశాన్నంటిన కూరగాయల ధరలు

● సామాన్యుడు విలవిల
● పచ్చి మిర్చి కేజీ రూ.100 ● టమోటా రూ.50

గోనెగండ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కూరగాయల ధరలు చుక్కలు చూపుతున్నాయి. దీంతో సామాన్య జనం కూరగాయలు కొనేందుకు జంకుతున్నారు. నవంబరు మాసం పదిరోజులు అయినా ధరలు మాత్రం తగ్గలేదు. గత నెలలో వర్షాలు కురిసినప్పటికీ కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టడం లేదు. మరో నెల రోజుల పాటు ఇవే ధరలు కొనసాగుతాయని వ్యాపారులు తెలుపుతున్నారు. సాగుకు నీరు అందక దిగుబడి తగ్గిపోతుంది. కొన్ని రోజులుగా కూరగాయా, ఆకుకూ రల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కూరగాయలు కొనడానికి రూ. 300 తీసుకుపోతే నాలుగు రకాల కూడా చేతికి రావడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలంలోని గ్రామాలు, గూడురు, బెళగల్, ప్రాంతాల రైతులు పండించిన పంటలు ఎమ్మిగనూరు మార్కెట్‌కు తరలిస్తారు. అక్కడ వ్యాపారులు రైతుల దగ్గర నుంచి తక్కువ ధరలకు కొని మార్కెట్‌లో ఎక్కువ ధరలకు అమ్మకాలు చేస్తున్నారని రైతులు విమర్శిస్తున్నారు. కూరగాయల ధరలు కిలోల్లో పచ్చిమిర్చి రూ.100, టమోటా రూ.50, వంకాయలు రూ. 90, బెండకాలు రూ. 90, చెవలకాయలు రూ. 80, అలుగడ్డలు రూ. 80, క్యారెట్ రూ. 90, కాకరకాయలు రూ. 100, తోట కూర కట్టలు రెండు రూ. 20, పాలకూర కట్టలు రెండు రూ. 20. పలుకుతున్నాయి.



కూరగాయలు అమ్ముతున్న మహిళ

డీలర్లపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కందిపప్పు కోటాను తగ్గించి ఇచ్చిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు గోవర్ధనమ్మ, సీఐటీయూ నాయకులు గోవిందు, రాముడులు కోరారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకురాళ్లు సలీమా భాను, జయలక్ష్మి, కైరోన్, గౌసీయా బేగం, ప్రజాసంఘాల నాయకులు లక్ష్మీనరసయ్య, సురేష్, రమేష్ పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

పుస్తకావిష్కరణ

ఎమ్మిగనూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రకోట సమీపంలో ఉన్న సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ సుధాకర్, పి. ఇమ్రాన్‌ఖాన్ మైక్రోవేవ్ ఇంజనీరింగ్‌పై కొత్త పుస్తకాన్ని రచించారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీరన్న ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు: సీఐ

గోనెగండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాలో ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలని ఆ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గోనెగండ్ల సీఐ గంగాధర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన సమావేశంలో మాట్లాడుతూ ఉచిత ఇసుక సామాన్య ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల పేరు చెప్పి అక్రమంగా అమ్మకాలు జరుపుకుంటే కఠిన చర్యలు తప్పవని అన్నారు. అలాగే నదిపరివాహక ప్రాంత గ్రామీణ ప్రజలకు పలు సూచనలు చేశారు. ఎక్కువరేటుకు ఇసుకను అమ్మకాలు జరిపినా కూడ కేసు నమోదు చేస్తామన్నారు.

వలసల నివారణకు చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించాలని ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు ఆనంద్‌బాబు, కరుణాకర్, నబిరసూల్ డిమాండ్ చేశారు. శుక్రవారం గోనెగండ్లలో సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి అయినప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. రూ.6072 కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆరోపించారు. ముందస్తు బిల్లును చెల్లించి విద్యుత్‌ను కొనుగోలు చేసే స్మార్ట్ మీటర్లును ప్రవేట్ వ్యక్తుల ద్వారా ఇళ్లకు బిగిస్తున్నారని వారు తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ అక్రమార్కులకు ఆర్థిక వనరుగా మారిందన్నారు. ఈ నెల 15న గోనెగండ్లలో ప్రజా సమస్యలపై ప్రజాపోరు కార్యక్రమం చేపడుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో గిరిరాజు, రామదాసు, నరసింహులు, జయన్న, చంద్ర, మునిస్వామి, రంగస్వామి, సాదిక్, హనుమంతు, చిట్టి నాయుడు, షేక్షావలి, బడేసావలి, సుభాన్, పాల్గొన్నారు.

తేరుబజారులో చెత్త కుప్ప తొలగింపు

కోసిగి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని తేరుబజారు మైదానంలో చెత్త కుప్పలు దంపుగా ఉండటంతో ఇది ఊరా.. చెత్త దిబ్బనా అని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు స్పందించారు. తేరుబజారు మైదానంలో ఉన్న చెత్తకుప్పను పారిశుధ్య కార్మికులతో తొలగించారు. కొన్ని నెలలుగా తేరుబజారు మైదానంలో చెత్త కుప్పలతో రోడ్డు దర్శనం ఇస్తుండటంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. చెత్తకుప్పను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా ప్యాచ్‌వర్క్ పనులు

కోసిగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుంతలు లేని రోడ్లను చూడాలనే సంకల్పంతో ముమ్మరంగా తారురోడ్డు ప్యాచ్‌వర్కుల పనులను ప్రభుత్వం ప్రారంభించింది. నాలుగు రోజుల క్రితం మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి, కోసిగి, పెద్దతుంబళం తారోడ్డు ప్యాచ్‌వర్కులను ప్రారంభించగా.. శుక్రవారం కోసిగి, పెద్దతుంబళం తారోడ్డులో గుంతలు పడ్డ ప్యాచ్‌వర్కులను ముమ్మరంగా జేసీబీలతో గుంతలు పూడుస్తూ పనులు చేస్తున్నారు. 15 రోజుల్లో గుంతల రోడ్లను మరమ్మతుల పనులు పూర్తి చేస్తున్నట్లు ఎన్.రాఘవేంద్రరెడ్డి తెలిపారు.

వీరభద్ర స్వామి మహోత్సవం

గోనెగండ్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో కార్తీక మాసంలో శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని వీరశైవులు తమ ఇంటి ఇలవేల్పయిన వీరభద్ర స్వామికి ఉత్సవం నిర్వహించారు. స్వామివారిని వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య సుగంధ పుష్పాలతో అందంగా అలంకరించారు. ఆకు పూజ, బిల్వార్చన, మహామంగళహారతి, వీరభద్రనామాష్టకం నిర్వహించారు. సాయంత్రం భజన చేశారు. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

●పని వేళలు పాటించని అంగన్‌వాడీ కార్యకర్తలు



మధ్యాహ్నం 1:50 గంటలకే మూతబడిన తారాపురం అంగన్‌వాడీ కేంద్రం

పెద్దకడబూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించడం లేదు. నామమాత్రంగా సెంటర్లను నిర్వహిస్తున్నారు. తమకు ఇష్టం వచ్చిన సమయంలో కేంద్రాలకు వస్తున్నారు. శుక్రవారం పెద్దకడబూరు మండల పరిధిలోని నౌలేకల్, తారాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తారాపురంలో మధ్యాహ్నం 1.50 గంటలకు మూసివేయగా, నౌలేకల్‌లో చిన్నారులను ఇంటికి పంపి కేవలం కార్యకర్త మాత్రమే కేంద్రంలో ఉండడం గమనార్హం. ఇలాకే రోజు ఉంటుందని తల్లిదండ్రులు తెలిపారు. కనీసం సూపర్‌వైజర్ గాని, సీడీపీవో గాని కేంద్రాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



పిరమిడ్ ఆకారంలో విద్యార్థుల విన్యాసం

కోసిగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో 75వ బీఎస్‌జీ (భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్) డేను పురస్కరించుకుని కోసిగిలోని మోడల్ స్కూల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సమీరారెడ్డి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఫ్లాగ్ డే స్టిక్కర్స్ మేళా నిర్వహించడంతో పాటు పాఠశాలలోని 62 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో ఫ్లాగ్ మేళాను నిర్వహించారు. శుక్రవారం కోసిగిలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి బస్టాండు వరకు ర్యాలీ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం వాల్మీకి సర్కిల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పిరమిడ్స్ నిర్వహించి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ సమీరారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం విద్యార్థులకు అనేక ప్రయోజనాలు అందిస్తుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఎంఈవో-2 శోభారాణి, మాస్టర్ సుందర్ కుమార్, గైడ్స్ రాజేశ్వరి, మధుబాబు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.